సాక్షి చిత్తూరు

మంగళవారం । 6 । మే । 2025



జిల్లా సమగ్రాభివృద్ధికి చర్యలు

అధికారులు జిల్లా సమగ్రాభివృద్ధికి చర్యలు తీసుకోవాలని జోనల్ ఇన్‌చార్జ్ ఆఫీసర్ కృష్ణబాబు ఆదేశించారు. - 8లో



నీటి సమస్య పరిష్కరించండి

గ్రామాల్లో నీటి సమస్య అధికంగా ఉందని, పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు సూచించారు. - 8లో



ఉపాధి కూలీలపై తేనెటీగల దాడి

శ్రీరంగరాజపురం మండలం దిగువ రిం పుజరాజపురంలో ఉపాధి కూలీలపై తేనెటీగలు దాడి చేశాయి. - 8లో

న్యూస్‌రీల్

గంగ జాతర పోస్టర్ల ఆవిష్కరణ

- నేడు జాతర చాటింపు
- 13,14 తేదీల్లో జాతర



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జాతర నిర్వాహకులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరంలోని పొన్నియమ్మ దేవస్థానంలో సోమవారం గంగజాతర పోస్టర్లను ఆవిష్కరించారు. వంశవ పారంపర్య ధర్మకర్త సీకే బాబు సతీమణి సీకే లావణ్య మాట్లాడుతూ పూర్వీకుల కట్టుబాట్ల మేరకు జరిగే గంగ జాతరలో అందరూ భాగస్వాములు అవుదామని పిలుపునిచ్చారు. గంగ జాతరను పురస్కరిచుకుని మంగళవారం సాయంత్రం చాటింపు జరుగుతుందన్నారు. ఈ నెల 13, 14వ తేదీల్లో జాతర జరుగుతుందన్నారు. ఇందుకు కావాల్సిన అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా చేపడుతున్నామన్నారు. భక్తులందరూ జాతరను అంగరంగ వైభవంగా జరిపించేందుకు సహకరించాలన్నారు. కార్యక్రమంలో వంశపారంపర్మ ధర్మకర్తలు హేమంత్, నిర్వాహకులు గుణ, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసు గ్రీవెన్స్‌కు 38 ఫిర్యాదులు



బాధితుడి సమస్య ఆరా తీస్తున్న ఎస్పీ మణికంఠ

చిత్తూరు అర్బన్: నగరంలో నిర్వహించిన పోలీసు ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో 38 వినతులు అందాయి. చిత్తూరు ఏఆర్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎస్పీ మణికంఠ ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులు స్వీకరించారు. వీటిలో మోసాలు, వేధింపులు, కుటుంబ తగాదాలు, ఇంటి తగాదాలు, భూ తగాదాలు, ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన సమస్యలున్నాయి. పలు ఫిర్యాదులపై అప్పటికప్పుడే వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయా స్టేషన్ హౌజ్ అధికారులతో మాట్లాడారు. ప్రతి ఫిర్యాదును ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. ప్రజల నుంచి వచ్చే ప్రతి సమస్యపై విచారణ చేపట్టి, ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు.

ఆర్థికసాయం అందజేత



చెక్కు అందజేస్తున్న ఎస్పీ

చిత్తూరు అర్బన్: నగరంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం అనారోగ్యంతో మృతి చెందిన బాధిత కుటుంబానికి ఎస్పీ మణికంఠ చందోలు ఆర్థికసాయం చెక్కును అందజేశారు. గుడుపల్లి పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న లక్ష్మీ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. ఈ మేరకు ఐడీఆర్ఎఫ్ ఫండ్ నుంచి రూ. లక్ష మొత్తానికి సంబంధించిన చెక్కును ఎస్పీ మణికంఠ, మృతురాలు లక్ష్మి భర్త హరీష్‌కు అందజేశారు. కుటుంబానికి శాఖపరంగా సాయపడతామని ఆయన హామీ ఇచ్చారు.

వరసిద్ధుడికి రూ.8.49 లక్షల విరాళం



విరాళ పత్రం అందజేస్తున్న దాత

కాణిపాకం: వరసిద్ధి వినాయకస్వామి ఆలయానికి సోమవారం ఓ దాత రూ.8.49 లక్షల నగదు విరాళం ఇచ్చారు. నంద్యాలకు చెందిన దాత రఘు శరణేష్ కుటుంబ సమేతంగా రూ.8,49,983 నగదును ఆలయంలో ఆన్‌లైన్ ద్వారా చెల్లించారు. ఇందులో బంగారు రథానికి రూ.3,99,992, ఈ-హుండీకి రూ.2,49,995, నిత్యాన్నదానానికి రూ.49,999, ఆలయాభివృద్ధికి రూ.49,999, ఉచిత ప్రసాదానికి రూ.49,999, గో సంరక్షణ ట్రస్టుకు రూ.49,999 వంతున అందజేశారు. ఆ విరాళ పత్రాన్ని ఏఈఓ రవీంద్రబాబుకు దాత అందజేశారు. దాతకు ఆలయాధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వేదపండితులు ఆశీర్వచనాలు పలికి, తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ప్రగతి జాడ కనిపించేనా?

చిత్తూరు జిల్లాను సమస్యలు పట్టి పీడిస్తున్నాయి. కూటమి సర్కారు, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యంతో పలు పథకాలు బాలారిష్టాలు ఎదుర్కొంటున్నాయి. లక్ష్యాలన్నీ అట్టడుగున ఉండిపోతున్నాయి. ప్రజాప్రతినిధులు, అధికారుల అలసత్వంతో అభివృద్ధి కుంటుపడుతోంది. కూటమి పాలనలో అసలు జిల్లా అభివృద్ధి సమావేశాల ఊసే కరువైంది. రెండు నెలలకొకసారి జరగాల్సిన సమావేశం 11 నెలల్లో రెండోసారి జరగడమే ఇందుకు నిదర్శనంగా నిలుస్తోంది. ఈ సారైనా ప్రగతి జాడ కనిపించేనా అని జిల్లా ప్రజలు వేచి చూస్తున్నారు.



పులిచెర్ల మండలంలో సంచరిస్తున్న ఏనుగులు



ఏనుగుల దాడిలో ధ్వంసమైన వరిపంట

- గిట్టుబాటు ధర లేక టమాట రైతుల గగ్గోలు
- పంటలపై ఆగని గజదాడులు
- రైతు సేవా కేంద్రాల్లో సిబ్బంది కొరత
- రెవెన్యూ కార్యాలయాల్లో ముడుపులు ఇవ్వకుంటే చుక్కలే
- నేడు జిల్లా స్థాయి అభివృద్ధి కమిటీ సమీక్ష సమావేశం

చిత్తూరు కలెక్టరేట్ : 'ఇన్‌చార్జ్ మంత్రి జిల్లాలో సమస్యలు పట్టించుకునేనా? ఈ సమావేశంలోనైనా అభివృద్ధి గురించి చర్చించేనా? లేదా అని జిల్లా ప్రజలు ప్రశ్నిస్తున్నారు. నిబంధనల ప్రకారం రెండు నెలలకు ఒకసారి జిల్లా కేంద్రంలో జిల్లా స్థాయి అభివృద్ధి కమిటీ సమీక్ష సమావేశం నిర్వహించాల్సి ఉంది. ఇందులో జిల్లా అభివృద్ధితోపాటు, ప్రజల సమస్యలు చర్చించాల్సి ఉంది. అయితే కీలకమైన ఈ అభివృద్ధి కమిటీ సమావేశం కూటమి ప్రభుత్వ పాలనలో ఇష్టానుసారంగా తమకు నచ్చినప్పుడు నిర్వహిస్తున్నారు. అప్పుడైనా ప్రజల సమస్యలు పరిష్కారం అవుతున్నాయంటే.. అదీ లేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 11 నెలలు పూర్తి కావొస్తున్నా ఇప్పటి వరకు ఒకటే సమావేశం నిర్వహించారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఉదయం 10 గంటలకు ఇన్‌చార్జ్ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో జిల్లా అభివృద్ధి కమిటీ సమీక్ష సమావేశం నిర్వహించనున్నారు. ఈ సమావేశంలోనైనా సమస్యల పట్ల క్షుణ్ణంగా చర్చించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

సిబ్బంది కొరత.. రైతుకు అవస్థ

రైతు సేవా కేంద్రాల్లో సిబ్బంది కొరత వేధిస్తోంది. దీంతో ఆ కేంద్రాల్లో పనిచేస్తున్న అరకొర సిబ్బంది పైనే అదనపు భారం పడుతోంది. ఫలితంగా రైతులు తమ సమస్యలు పరిష్కరించుకోలేక అవస్థలు ఎదుర్కొంటున్నారు. జిల్లాలోని చిత్తూరు, పూతలపట్టు, గంగాధరనెల్లూరు, నగరి నియోజకవర్గాల్లో 249 రైతు సేవా కేంద్రాలుండగా 113 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇందులో వ్యవసాయ, ఉద్యానశాఖల కు సంబంధించిన పోస్టులే అధికంగా ఉండడంతో సమస్యలు అధికంగా ఉన్నాయి. కూటమి ప్రభుత్వ పాలనలో నెలలు గడుస్తున్నా ఆ పోస్టులను భర్తీ చేయని దుస్థితి.

పంటలపై ఆగని గజదాడులు



ఐరాల మండలంలో ఏనుగులు ధ్వంసం చేసిన వరి

జిల్లాలోని కుప్పం, బంగారుపాళెం, పలమనేరు, పులిచెర్ల, గుడిపాల తదితర మండలాల్లో రైతుల పంటలపై గజదాడులు ఆగడం లేదు. జిల్లాలోని ఏదో ఒక ప్రాంతంలో ఏనుగులు సంచరిస్తూ రైతుల పంటలకు నష్టం చేకూరుస్తున్నాయి. ఈ నెల 2 వ తేదీన పులిచెర్ల మండలంలోని కమ్మపల్లి, రాయవారిపల్లి పంచాయతీల్లో ఒంటరి ఏనుగు పంటలను ధ్వంసం చేసింది. అదే రోజు బంగారుపాళ్యం మండలం మొగిలి సమీపంలో ఉన్న అటవీ ప్రాంతంలో ఏనుగులు పంటలపై దాడి చేశాయి. ఇలాంటి ఘటనలు జిల్లాలోని పలు ప్రాంతాల్లో నిత్యం చోటు చేసుకుంటూనే ఉన్నాయి. అయినప్పటికీ కూటమి ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం, అటవీశాఖ అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదు.

అప్పుల ఊబిలో టమాట రైతు



బైరెడ్డిపల్లి మండలంలో సాగు చేసిన టమాట

జిల్లాలో ప్రధాన పంట అయిన టమాట. ఈ పంటకు సరైన గిట్టుబాటు ధర లేక రైతులు గగ్గోలు పెడుతున్నారు. టమాట ధరలు రోజు రోజుకూ తగ్గిపోతుండడంతో రైతుల్లో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. మొదటి రకం 15 కిలోల బాక్సు రూ.90కి తగ్గిపోయింది. రెండు, మూడోరకం రూ.40 నుంచి రూ.60 వరకు మాత్రమే ధర పలుకుతోంది. టమాట ధరలు పతనావస్థలోనే కొనసాగుతున్నా కూటమి సర్కారు ఏ మాత్రం పట్టించుకోకపోవడంతో రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు.

ముడుపులిస్తేనే పనులు



జిల్లాలోని రెవెన్యూ కార్యాలయాల్లో అవినీతి రాజ్యమేలుతోంది. ఆ కార్యాలయాలకు పలు పనుల నిమిత్తం వెళ్లే ప్రజలు ముడుపులిస్తేగానీ పనులు జరగడం లేదు. అడిగినంత ఇస్తేనే ఫైళ్లను ముందుకు పంపుతున్నారు. అడిగినంత ఇచ్చుకోలేని రైతుల భూముల మ్యుటేషన్ దరఖాస్తులను అడ్డగోలుగా తిరస్కరిస్తున్నారు. లేదంటే చిన్న చిన్న కారణాలను సాకుగా చూపించి పక్కన పెట్టేస్తున్నారు. అలాగే ప్రజా సమస్యల పరిష్కారానికి సైతం లంచాలు అడుగుతున్నారు. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధుల నుంచి క్షేత్రస్థాయిలో రెవెన్యూ కార్యాలయాలకు పరిష్కారం కోసం వెళ్లే దరఖాస్తులను పట్టించుకోకుండా బుట్టదాఖలు చేస్తున్నారు.

ట్రాన్స్‌కోకు రూ.12.50 లక్షల నష్టం



లైన్‌లు మరమ్మతు చేస్తున్న సిబ్బంది

చిత్తూరు(కార్పొరేషన్): జిల్లాలో ఆదివారం కురిసిన గాలీవాన కారణంగా ట్రాన్స్‌కోకు రూ.12.50 లక్షలు నష్టం వాటిల్లినట్లు ఆ సంస్థ ఎస్ఈ ఇస్మాయిల్ అహ్మద్ తెలిపారు. సాయంత్రం నుంచి గాలీవానతో పలు ప్రాంతాల్లో చెట్లు, కొమ్మల స్తంభాలు, లైన్‌పై పడడంతో విద్యుత్ అంతరాయం ఏర్పడిందన్నారు. వీటని వర్షంలో సిబ్బంది పునరుద్ధరించారన్నారు. మొత్తం 111 స్తంభాలు, 56 ట్రాన్స్‌ఫార్మర్లు, 4 కిలోమీటర్ల దూరం లైన్ దెబ్బతినిందన్నారు. దీంతో విద్యుత్‌శాఖకు నష్టం వాటిల్లిందన్నారు.

ఐసెట్ పరీక్షను అడ్డుకుంటాం



మాట్లాడుతున్న పూజారి రాఘవేంద్ర

చిత్తూరు కలెక్టరేట్ : జీఓ నంబర్ 77 రద్దు చేయకుంటే ఈ నెల 7వ తేదీన నిర్వహించే ఐసెట్ పరీక్షను అడ్డుకుంటామని ఏబీవీపీ జాతీయ కార్యవర్గ సభ్యులు పూజారి రాఘవేంద్ర వెల్లడించారు. జిల్లా కేంద్రంలో ఆ సంఘం కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జీఓ నంబర్ 77ను రద్దు చేయాలన్నారు. గత సంవత్సరం ఆ జీఓ రద్దు చేయకుండా ప్రైవేట్ కళాశాలలో పీజీ అడ్మిషన్లు చేశారన్నారు. ఈ సంవత్సరం ఆ జీఓను రద్దు చేయకుండా మే 7న ఐసెట్ ప్రవేశ పరీక్షలు నిర్వహిస్తున్నారన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం స్పందించి ఆ జీఓను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సురేంద్ర, పవన్, నంద కిశోర్, కార్యకర్తలు పాల్గొన్నారు.

కలెక్టర్ ఆదేశాలు 'మరుగు'న!

అది సాక్షాత్తు ప్రభుత్వ కార్యాలయం.. స్వచ్ఛతకు పుష్కలంగా నిధులున్నాయ్.. మే 15లోపు మరుగుదొడ్ల మరమ్మతు చేయాలని కలెక్టర్ ఆదేశాలు.. అయినా అధికారుల నిర్లక్ష్యం.. ఉదాసీనత.. వెరసి ఆ కార్యాలయంలోని మహిళా ఉద్యోగినులు ఉదయం ఇంట్లో బయలు దేరే ముందు.. ఇంటి కెళ్లిన తరువాతే కాలకృత్యాలు తీర్చుకోవాల్సిన పరిస్థితి. ఒక వేళ అత్యవసరమైనా అవస్థ పడాల్సిందే. కలెక్టర్ ఆదేశాలే మరుగున పడిపోతున్నాయని ఉద్యోగుల ఆవేదన. ఇదీ సర్వశిక్ష శాఖ ఇంజినీరింగ్ అధికారుల వ్యవహారశైలి.

- మరుగుదొడ్ల మరమ్మతులకు నిధులు మంజూరు
- నెల రోజుల్లో పనులు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశం
- ఇంకా ప్రారంభం కాని పనులు
- ఇక ఏడు రోజులే గడువు



పాడైపోయి అపరిశుభ్రంగా ఉన్న విద్యాశాఖ కార్యాలయంలోని మరుగుదొడ్లు



నిరుపయోగంగా ఉన్న మరుగుదొడ్లు

చిత్తూరు కలెక్టరేట్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్వచ్ఛతకు పెద్దపీట వేస్తున్నాయి. బహిరంగ మలమూత్ర విసర్జన నిర్మూలించడానికి రూ.కోట్లు వెచ్చించి, మరుగుదొడ్లను నిర్మించేలా చర్యలు చేపడుతోంది. అయితే కొంతమంది అధికారులు ఆ లక్ష్యానికి తూట్లు పొడుస్తున్నారు. జిల్లా విద్యాశాఖ ప్రాంగణంలో విద్యాశాఖతోపాటు సమగ్రశిక్ష శాఖ కార్యాలయాలున్నాయి. ఈ కార్యాలయాల్లో దాదాపు 25 మంది మహిళా ఉద్యోగులు, 35 మంది పురుషులు విధులు నిర్వర్తిస్తున్నారు. వీరితో ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలోని ఉపాధ్యాయులు పలు పనుల నిమిత్తం నిత్యం విద్యాశాఖ కార్యాలయానికి విచ్చేస్తుంటారు. జిల్లా విద్యాశాఖ ప్రాంగణంలో ఉన్న మరుగుదొడ్లు పాడైపోయి నిరుపయోగంగా ఉన్నాయి. దీంతో జిల్లా కేంద్రంలోని ముఖ్య శాఖల్లో ఒకటైన విద్యాశాఖలో మరుగుదొడ్లు ఉన్నా..లేనట్టే అయ్యింది. దీంతో ఉద్యోగులు కాలకృత్యాలు తీర్చుకునేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

మహిళా ఉద్యోగుల పరిస్థితి వర్ణనాతీతం

విద్యాశాఖ, సమగ్రశిక్ష శాఖ కార్యాలయాల్లో పని చేస్తున్న మహిళా ఉద్యోగుల పరిస్థితి వర్ణనాతీతం. ఉదయం నుంచి సాయంత్రం వరకు కార్యాలయంలో విధులు నిర్వహించే మహిళా ఉద్యోగులు మరుగుదొడ్లు లేకపోవడంతో వారి బాధలు వర్ణనాతీతంగా ఉన్నాయి. వారి సమస్యను ఎవరితో చెప్పుకోలేక ఇటీవల డీఈఓ దృష్టికి వారి సమస్యను తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన డీఈఓ వరలక్ష్మి మరుగుదొడ్ల మరమ్మతుల సమస్యను కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన కలెక్టర్ మరుగుదొడ్ల మరమ్మతులకు రూ.5.35 లక్షలను కలెక్టర్ ఫండ్స్ నుంచి వెంటనే విడుదల చేశారు.



మరమ్మతు కోసం తోలిన కంకర, ఇసుక

అడ్వాన్స్ ఇస్తేనే పనులు మొదలు

విద్యాశాఖ కార్యాలయంలోని మరుగుదొడ్ల పనులను ఈ నెల 15వ తేదీ లోపు పూర్తి చేయాలని కలెక్టర్ సమగ్రశిక్ష శాఖ ఇంజినీరింగ్ అధికారులకు ఉత్తర్వుల్లో ఆదేశించారు. నిధులను సైతం సమగ్రశిక్ష శాఖ అధికారుల ఖాతాల్లో జమ చేశారు. అయితే పనులు మొదలు పెట్టాల్సిన ఇంజినీరింగ్ విభాగం సైట్ ఇంజినీర్ మునిరత్నం ముందుగా అడ్వాన్స్ ఇస్తేనే పనులు మొదలుపెడతానంటూ అలసత్వం వహిస్తున్నారు. డీఈఓ కార్యాలయంలో మరుగుదొడ్ల పనులకు ఇసుక, కంకరను తోలించి మిన్నకుండిపోయారు. కలెక్టర్ ఉత్తర్వుల ప్రకారం ఆ మరుగుదొడ్ల పనులను పూర్తి చేసేందుకు ఇక పది రోజులే గడువు ఉంది. ఆ లోపు పనులు పూర్తి చేస్తారా? కలెక్టర్ ఉత్తర్వులను దిక్కరిస్తారా? అని విద్యాశాఖ ఉద్యోగులు గుసగుసలాడుతున్నారు.

వెళ్లడానికి సిద్ధంగా ఉన్నారా?

- రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ



పోస్టులను భర్తీ చేయాలని నివేదిస్తున్న యూనియన్‌నాయకులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): మీరంతా వేరే చోటకు వెళ్లడానికి సిద్ధంగా ఉన్నారా..లేదా? అని ప్రభుత్వ వైద్య బృందాన్ని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ కృష్ణబాబు ప్రశ్నించారు. చిత్తూరు నగరంలోని జిల్లా ప్రభుత్వాస్పత్రిని సోమవారం ఆయన పరిశీలించారు. తొలుత అత్యవసర విభాగంలో అందుతున్న సేవలు, లోటుపాట్లపై ఆస్పత్రి అధికారులను, అపోలో నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. తర్వాత ఎంఎస్ వార్డులోని పలు విభాగాలను తనిఖీ చేశారు. ఈ క్రమంలో ఆయన మీరంతా వేరే చోటకు వెళ్లడానికి సిద్ధంగా ఉన్నారా? అని ప్రభుత్వ వైద్యబృందాన్ని ప్రశ్నించారు. ఇందుకు పలువురు... ఎండీయూ ఒప్పందం ప్రకారం 70 శాతం అపోలో, 30 శాతం ప్రభుత్వ వైద్యులు, సిబ్బంది ఇక్కడ పనిచేసేలా ఉందని బదులిచ్చారు. ఆ ప్రకారమే పనిచేస్తామని..బదిలీలు, డిప్యూటేషన్లకు అవకాశం కల్పించాలని వారు ఆయన్ని కోరారు.

'సాక్షి' కథనానికి స్పందన

సాక్షి ఎఫెక్ట్..

సాక్షి దినపత్రికలో సోమవారం అరకొర వైద్యం పేరిట కథనం ప్రచురితమైంది. దీనిపై రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ కృష్ణబాబు స్పందించారు. ఆస్పత్రిలో అందుతున్న సేవలను అడిగే సమయంలో.. స్టాఫ్ నర్సులు 78 మందికి 61 మంది మాత్రమే ఉన్నారా? అని అధికారులను ఆరా తీశారు. ఇందుకు ఏపీజీఎన్ఏ అధ్యక్షురాలు రాణి, సభ్యులు హిమబిందు సమాధానమిస్తూ స్టాఫ్‌నర్సు ఖాళీలు, ఎంఎన్ఓ, ఎఫ్ఎన్ఓ, ఇతరాత్ర పోస్టులు ఖాళీలున్నాయని, దీంతో పనిభారం అధికంగా ఉందని తెలిపారు. పోస్టుమార్టం చేసేందుకు ఇద్దరు డాక్టర్లే ఉన్నామని..కొంత మంది డాక్టర్లు అవసరమవుతోందని పలువురు వైద్యులు కోరారు. డీసీహెచ్ఎస్ పరిధిలో 20 ఏళ్లుగా కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న ల్యాబ్ టెక్నీషియన్, ఫార్మసిస్ట్, రేడియోగ్రాఫర్స్, స్టాఫ్‌నర్స్‌లను క్రమబద్ధీకరించాలని కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు వెంకటేష్ విజ్ఞప్తి చేశారు. అలాగే 15 ఫార్మసిస్ట్ పోస్టులను భర్తీ చేయాలని ఏపీ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు జయచంద్రకుమార్ ఆయన దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం ఆయన ఆస్పత్రి అధికారులతో సమీక్ష నిర్వహించగా...ఒప్పందం ప్రకారం ఆస్పత్రి నిర్వహణ జరుగుతోందా? లేదా ఆస్పత్రి అధికారులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డీసీహెచ్ఎస్ పద్మాంజలి దేవి, డీఎంఅండ్‌హెచ్ సుధారాణి, అపోలో నిర్వాహకులు నరేష్‌కుమార్‌రెడ్డి, రాంగోపాల్ రెడ్డి తదితరులున్నారు.

గ్రీవెన్స్‌లో తీరని సమస్యలు

- భూ సమస్యలపై అధిక సంఖ్యలో అర్జీలు
- సమస్యలపై నిర్లక్ష్యం వద్దన్న జేసీ విద్యాధరి



అర్జీదారుతో మాట్లాడుతున్న జేసీ విద్యాధరి

పలమనేరు: పలమనేరు డివిజన్‌లో రెవెన్యూ సమస్యలు అధికంగా ఉన్నాయని గ్రహించిన జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ ప్రత్యేక చొరవ చూపి ఇక్కడే నెల రోజుల పాటు గ్రీవెన్స్‌డే నిర్వహించాలని సంకల్పించారు. కానీ ఇక్కడ జరుగుతున్న గ్రీవెన్స్‌డేలో ప్రజలు సమస్యలు పరిష్కారానికి నోచుకోలేదనే విషయం స్పష్టంగా అర్థమవుతోంది. ఆ మేరకు స్థానిక మున్సిపల్ కార్యాలయంలో జేసీ విద్యాధరి ఆధ్వర్యంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి అర్జీదారులు హోరెత్తారు. అర్జీల్లో ఎక్కువగా రీసర్వే, భూసమస్యలు, వివాదాలకు సంబంధించిన వినతులే వచ్చాయి. సమస్యలను శాఖల వారీగా అధికారులు క్షేత్రస్థాయిలో విచారించి త్వరితగతిన పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ సూచించారు. కేవలం కింది స్థాయి రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం కారణంగా సమస్యలు త్వరితగతిన పరిష్కారం కావడంలేదనే విషయం ఆమెకు అర్థమైంది. ఎందుకంటే ప్రతి గ్రీవెన్స్‌డేకు వచ్చినవారే మళ్లీ రావడంపై ఆమె అసహనం వ్యక్తం చేశారు. ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో 273 వినతులు వచ్చాయి. వీటిలో భూ ఆక్రమణలపై 38, సామాజిక పింఛన్లు 32, ఇళ్ల పట్టాలు 23, ఆర్ఓఆర్ 19, పట్టాదారు పాసు పుస్తకాలు 16, అసైన్‌మెంట్ 10, మ్యుటేషన్ 10, దారి సమస్యలు 10, పీపీబీ 5 వచ్చాయి.

కొందరి సమస్యలివీ..

- గంగవరం మండలం లక్ష్మీపురానికి చెందిన సరోజమ్మ తాను పట్టణంలోని గంటావూరులో 15 ఏళ్లుగా కాపురం ఉంటున్నాని, ఇక్కడ తన భవనం ఉన్న భూమికి పట్టా ఇప్పించాలని కోరారు.
- గంగవరం మండలం కలగటూరుకు చెందిన రెడ్డెమ్మ తనకు వికలాంగ పింఛన్ ఇవ్వాలని కోరారు.
- తన బిడ్డ 17 ఏళ్లగా లేవలేని పరిస్థితిలో ఉందని, ఆ బాలికకు వైద్యసాయం కావాలని బైరెడ్డిపల్లి మండలం చీలంపల్లికి చెందిన నాగమ్మ విన్నవించింది.
- తాము ఎన్నో ఏళ్లుగా అనుభవిస్తున్న ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురవతున్నాయని, చర్యలు తీసుకోవాలని రామకుప్పం మండలం మణీంద్రం వాసులు అర్జీ ఇచ్చారు.
- క్యాన్సర్‌తో బాధపడుతున్న తనకు పింఛన్ ఇవ్వాలని పెద్దకాప్పల్లికి చెందిన సీతమ్మ విన్నవించారు.
- 'పట్టణంలోని 11వ వార్డుకు చెందిన కుసుమ తనకు వితంతు పింఛన్ ఇవ్వలేదని ఫిర్యాదు చేసింది.
- ఆన్‌లైన్‌లో పేర్లు లేక ప్రభుత్వం నుంచి ఎలాంటి పథకాలు రావడం లేదని నగరి మండలం కాకివేడుకు చెందిన బాలయ్య, విజయ ఫిర్యాదు చేశారు.

క్లుప్తంగా

11 నుంచి కల్యాణ వెంకన్న బ్రహ్మోత్సవాలు



తిరుపతి కల్చరల్ : నారాయణవనంలోని శ్రీ పద్మావతి సమేత శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 11 నుంచి 19వ తేదీ వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్టు టీటీడీ జేఈవో వి.వీరబ్రహ్మం తెలిపారు. ఆయన సోమవారం బ్రహ్మోత్సవాల పోస్టర్లను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఉత్సవాల సందర్భంగా ఈ నెల 6న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం, 10న అంకురార్పణ నిర్వహిస్తారని తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా ప్రతిరోజూ ఉదయం 7.30 నుంచి 9.30 గంటల వరకు, తిరిగి రాత్రి 7 నుంచి 9 గంటల వరకు వాహన సేవలు చేపడతామని వెల్లడించారు. ఈ నెల 18వ తేదీ రాత్రి 8.30 నుంచి 10 గంటల వరకు స్వామివారి కల్యాణోత్సవం నిర్వహిస్తారన్నారు. ఈ సందర్భంగా టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్, అన్నమాచార్య ప్రాజెక్టు, దాస సాహిత్య ప్రాజెక్టు సంయుక్తంగా ఆధ్యాత్మిక, భక్తి సంగీత, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో స్థానిక ఆలయ డెప్యూటీ ఈవో నాగరత్నం, ఏఈవో రవి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఆర్టీసీ అధికారుల వేధింపులపై విజిలెన్స్ విచారణ

సత్యవేడు: సత్యవేడు ఆర్టీసీ డిపో అధికారులు వేధింపులకు గురిచేస్తున్నారని డ్రైవర్ గంగయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు విజిలెన్సు అధికారి తిమ్మారెడ్డి, సీఐ వర్మ సోమవారం విచారణ చేపట్టారు. ఏప్రిల్ 29న డ్రైవర్ గంగయ్య డ్యూటీ నిమిత్తం ఆర్టీసీ గ్యారేజ్‌కు వచ్చాడు. బస్సును సెక్యూరిటీ పాయింట్ వద్దకు తీసుకెళ్లాడు. మధ్యాహ్నం వరకు కండక్టర్ రాకపోవడంతో ఆ సర్వీసును డీఎం వెంకటరమణ రద్దు చేసి మధ్యాహ్నం మూడు గంటల డ్యూటీకి వెళ్లాలని డ్రైవర్ గంగయ్యను ఆదేశించారు. తనకు ఆరోగ్యం సరిగా లేదని, రాత్రి డ్యూటీకి వెళ్లలేనని గంగయ్య చెప్పడంతో డీఎం దూషించాడు. డ్రైవర్ సెక్యూరిటీ పాయింట్ వద్దకు వెళ్లగా అక్కడున్న సెక్యూరిటీ అధికారి సైతం రాత్రి డ్యూటీకి వెళ్లాల్సిందేనని ఆదేశించారు. ఈ నేపథ్యంలో గంగయ్య హైబీపీ కారణంగా కింద పడి పడిపోయాడు. అతన్ని ఆస్పత్రికి తరలించి చికిత్స చేయడంతో కోలుకున్నాడు. తర్వాత అధికారులు దూషించడంపై విజిలెన్సు అధికారులకు ఫిర్యాదు చేశాడు. విచారణకు వచ్చిన విజిలెన్సు అధికారులు తొలుత బాధితుడు గంగయ్యను విచారించి స్టేట్‌మెంట్ నమోదు చేశారు. అనంతరం కంట్రోలర్ వెంకటేశ్వర్లు, సెక్యూరిటీ అధికారి పళని, ఆర్టీసీ కండక్టర్ ఓ వెంకటేశులును విచారించి రాతపూర్వకంగా స్టేట్‌మెంట్ తీసుకున్నారు. అనంతరం ఆర్టీసీ డీఎం వెంకటరమణను విచారించినట్టు తెలిసింది.

నాన్నకు ప్రేమతో..

సాధారణంగా పిల్లలు చిన్నతనం నుంచి తమ తల్లిదండ్రుల్నే రోల్ మోడల్‌గా తీసుకుంటూ లక్ష్యం కోసం శ్రమిస్తారు. కలలు కనడం వేరు. ఆ కలలను సాకారం చేసుకోవడంలో పడే శ్రమ వేరు. అలా శ్రమించి, ఓ యువతి తన తండ్రి కలలను సాకారం చేసింది. "తల్లీ! మనం చిన్నమారుమూల గ్రామంలో ఉన్నాం .. ఇక్కడ మనలాంటి పేదలకు ఎన్నో సమస్యలున్నాయి. ఇవన్నీ తీరాలంటే కష్టాలు తెలిసిన మనలాంటి వాళ్లు కలెక్టర్‌గా రావాల..నీవు ఎలాగైనా కలెక్టరై ప్రజలకు సేవ చేయాలమ్మా!" ఇదీ ఆ మధ్య తరగతి తండ్రి చిన్నతనం నుంచే నూరిపోసిన మాటలు ఆమె మదిలో బలంగా నాటుకుపోయాయి. నీట్‌లో ఎంపికై ఎంబీబీఎస్ చదివి డాక్టరైంది. అంతటితో సంతృప్తి చెందలేదు. తండ్రి పంచిన ప్రేమ, నింపిన స్ఫూర్తి, ధైర్యంతో సివిల్స్ సాధనే లక్ష్యంగా ముందుకు కదిలింది. నాలుగుసార్లు సివిల్స్‌కు ఆన్‌లైన్‌లో శిక్షణ పొందింది. ఈ పర్యాయం జాతీయ స్థాయిలో 446 ర్యాంకు సాధించి తండ్రి కలను సాకారం చేసింది. ఊరంతా తబ్బిబ్బవుతోంది.

- యూపీఎస్సీ పరీక్షలో 446 ర్యాంకు
- మెడిసిన్ చదువుతూ సివిల్స్‌లో ఎంపిక
- తండ్రి కలను సాకారం చేసింది
- బైరెడ్డిపల్లె మండలంలో ఇద్దరు సివిల్స్‌కు ఎంపిక

రోజూ 8 గంటలకు ఆన్‌లైన్‌లో శిక్షణ
'సాక్షి'తో మాధవి


తల్లిదండ్రులతో ఆర్ మాధవి

తన తండ్రి కల నెరవేర్చడానికి కాలేజీ డేస్ నుంచే పట్టుదలతో చదివినట్టు సివిల్స్ విజేత మాధవి చెప్పారు. సివిల్స్‌కు ఎంపికైన నేపథ్యంలో ఆమె అనుభవాన్ని పాఠకులకు పంచేందుకు సాక్షి ఫోన్‌లో ఇంటర్వ్యూ చేసింది.

సాక్షి: డాక్టరయ్యాక సివిల్స్‌కు ఎలా ప్రిపేర్ అయ్యారు?

మాధవి: డాక్టరయ్యాక ఒక ప్రైవేటు హాస్పిటల్‌లో చేరాను. సివిల్స్‌లో చేసిన ప్రయత్నాల నుంచి కొంత నేర్చుకున్నాను. ఆ తర్వాత రెగ్యులర్‌గా ఆన్‌లైన్‌లో కొన్ని నెలల పాటు శిక్షణ పొందాను. రోజుకు 8 గంటలు శిక్షణకు కేటాయించేదాన్ని.

సాక్షి: సివిల్స్‌లో ఆప్షనల్ సబ్జెక్ట్ ఏం తీసుకున్నారు?

మాధవి: ఎమర్జింగ్ మెడిసిన్ తీసుకున్నా.

సాక్షి: పుస్తకాలు, మెటీరియల్ కోసం ఏం చేశారు?

మాధవి: 400 పైచిలుకు పుస్తకాలు చదివా. ఇంతకుముందు సివిల్స్‌కు ప్రిపేర్ అయిన సీనియర్స్ నుంచి మెటీరియల్ తీసుకున్నా. అది కూడా నాకు ఉపయోగపడింది.

సాక్షి: ఇంటర్వ్యూలో ఏ ప్రశ్నలు వేశారు?

మాధవి: మెడికల్ బ్యాక్ గ్రౌండ్ ప్రశ్నలే వేశారు. కాన్ఫిడెంట్‌గా అన్నింటికీ సమాధానాలు చెప్పాను.

సాక్షి: మీకు స్ఫూర్తి ఎవరు?

మాధవి: ఇంకెవరు మా నాన్నే! సమస్యల నడుమ పెరిగాం. నువ్వు డాక్టరైతే నలుగురికి సూదులేసి డబ్బులు సంపాదించుకోవచ్చు. అదే సివిల్స్‌లో ఎంపికైతే ఎందరికో మేలు చేయవచ్చు. అభివృద్ధికి నోచుకోని మన ఊరిలాంటి ఊర్లనెన్నో బాగు చేయవచ్చు..అని చెప్పేవారు. ఆ మాటలే నాపై బలమైన ప్రభావం చూపాయి. ఈ విజయం మానాన్నకే అంకితం.

పలమనేరు: పలమనేరు నియోజకవర్గం బైరెడ్డిపల్లె మండలంలోని రామాపురం మారుమూల గ్రామం. అభివృద్ధికి నోచుకోని ఈ గ్రామం మండల కేంద్రానికి 19 కిలోమీటర్ల దూరంలో ఉంది. ఇక్కడ 66 కుటుంబాలు ఉన్నాయి. సరైన రవాణా సౌకర్యం కూడా లేదు. చాలావరకు వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్న కుటుంబాలే. సరిగ్గా కర్ణాటక సరిహద్దులో ఉన్న ఈ గ్రామస్తులకు అటు రవాణా, చదువులు, వైద్యం, ఇతరత్రా వాటికి కర్ణాటక పట్టణాలు అనుకూలంగా ఉండడడంతో ఆ ప్రాంతాలతోనే ఎక్కువ అవినాభావ సంబంధాలు కలిగి ఉన్నారు. సరిహద్దు గ్రామం కావడంతో ఇటు ఆంధ్రాలో అటు ఆనుకుని కర్ణాటకలోనూ వ్యవసాయ భూములు ఉన్నాయి. అంధ్రా భూముల్లోని బోర్లతో రెండువైపులా పంటలు సాగు చేస్తున్నవారూ కొందరు ఉండటం విశేషం! గ్రామస్తులైన రవికుమార్, నందిని దంపతులు కర్ణాటకలోని శ్రీనివాసపురంలో ప్రైవేటు స్కూల్ టీచర్లుగా పనిచేస్తున్నారు. వీరికిద్దరు కుమార్తెలు. పెద్దకుమార్తె ఆర్.మాధవిని ప్రాథమిక విద్యను సైతం అక్కడే చదివించారు. ఆపై పీయూసీలో బైపీసీ కోలార్ సహేంద్ర కళాశాలలో చదివి నీట్‌లో 900 ర్యాంకు సాధించింది. దీంతో బెంగళూరులోని ఈఎస్ఐలో ఎంబీబీఎస్ ఫ్రీ సీటును సాధించి డాక్టరైంది.

తండ్రి కోరిక సాకారం చేయాలని..!

తాను ఎంబీబీఎస్ చేస్తున్నా సివిల్స్ సాధించాలనే తండ్రి కోరిక కోసం కష్టపడింది. డాక్టర్ కోర్సులో చాలా బిజీగా ఉన్నప్పటికీ హాస్టల్‌లో రాత్రుల్లో నిద్రపోకుండా సివిల్స్‌కు కేవలం ఆన్‌లైన్‌లోనే శిక్షణ పొందింది. ఎంబీబీఎస్ చేరినప్పటి నుంచి నాలుగు పర్యాయాలు సివిల్స్‌లో ప్రయత్నం చేసింది. ఎట్టకేలకు ఈసారి సివిల్స్‌లో 446 ర్యాంకు సాధించింది. మరో ఆరునెలల పాటు శిక్షణ పొంది ఆపై ఐఏఎస్ లేదా ఐపీఎస్‌కు ఎంపికానుంది. ఇలా ఉండగా, బైరెడ్డిపల్లెకు చెందిన రంపం శ్రీకాంత్ సైతం సివిల్స్‌లో 904 ర్యాంకును సాధించడం విదితమే.

చాలా సంతోషంగా ఉందాది

మా ఊరంతా వ్యవసాయ కుటుంబాలే. చదువుకునేందుకు ఏ సౌకర్యాలూ లేవు. మాధవి పక్కనే ఉన్న కర్ణాటకలో చదివి, డాక్టరవడమే కాకుండా ఇప్పుడు సివిల్స్‌కు ఎంపిక అవడం చెప్పలేనంత సంతోషంగా ఉందాది. మా ఊరికే కాదు..దేశంలో ఎక్కడ పనిచేసినా ప్రజలకు మేలు చేస్తాదనే నమ్మకం మా ఊరికుంది.

–రామరాజు, గ్రామపెద్ద, రామాపురం

ఉత్తమ విద్యార్థులకు బహుమతులు ప్రదానం


బహుమతి ప్రదానం చేస్తున్న ఎస్పీ

చిత్తూరు అర్బన్: పది పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన పోలీసు శాఖలో పనిచేస్తున్న ఉద్యోగుల పిల్లలను ఎస్పీ మణికంఠ చందోలు విలువైన బహుమతులతో సత్కరించారు. సోమవారం చిత్తూరు నగరంలోని పోలీసుల అతిథి గృహంలో 570కి పైగా మార్కులు సాధించిన విద్యార్థులకు బహుమతులు అందజేసి, అభినందించారు. ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రుల కష్టాలను తెలుసుకుని పిల్లలు ముందడుగు వేయాలన్నారు. భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని ఉన్నత చదువులు చదవాలన్నారు. తల్లిదండ్రులకు గుర్తింపు తెచ్చి పెట్టాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ రాజశేఖర్‌రాజు, శివానంద కిషోర్, డీఎస్పీ మహబూబ్‌బాషా సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 4 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు ఖాళీగా ఉన్నాయి. ఆదివారం అర్ధరాత్రి వరకు 83,380 మంది స్వామిని దర్శించుకున్నారు. 27,936 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామి వారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.35 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని వారికి 4 గంటలు పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది.

పీజీఆర్ఎస్ రద్దయినా విచ్చేసిన ప్రజలు


దారి సమస్య పరిష్కరించాలని కోరుతున్న నాగభూషణం


ధర్నా చేస్తున్న కార్మికులు, ఏఐటీయూసీ నాయకులు

చిత్తూరు కలెక్టరేట్ : కలెక్టరేట్‌లో నిర్వహించే పీజీఆర్ఎస్ (ప్రజాసమస్యల పరిష్కార వేదిక) సోమవారం రద్దు అయ్యింది. అయినప్పటికీ జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి ప్రజలు కలెక్టరేట్‌కు విచ్చేశారు. కలెక్టరేట్‌లో అర్జీలు స్వీకరించే అధికారులు ఎవరూ లేకపోవడంతో నిరాశతో వెనుదిరిగారు.

దయచేసి న్యాయం చేయండి

ఇంటికి వెళ్లే దారిని అక్రమంగా ఆక్రమించుకున్నారని, దయచేసి న్యాయం చేయాలని పెనుమూరు మండలానికి చెందిన నాగభూషణం ఆచారి ఆవేదన వ్యక్తం చేశారు. కలెక్టరేట్‌కు విచ్చేసిన ఆయన తన సమస్యను వెల్లడించారు. పెనుమూరు మండలంలో సర్వే నంబర్ 467/1ఏ లోని 20 సెంట్ల భూమిలో 30 ఏళ్లుగా నివసిస్తున్నట్లు తెలిపారు. తమ ఇంటికి వెళ్లే దారి సర్వే నంబర్ 468/1 లో కుంటపోరంబోకు స్థలం ఉందన్నారు. గత 30 ఏళ్లుగా అదే దారిని వినియోగించుకుంటున్నట్లు తెలిపారు. అయితే కళావతి అనే మహిళ ఆ దారిని ఆక్రమించి దారి లేకుండా ఇబ్బందులు సృష్టిస్తోందన్నారు.

కనీస వేతనం రూ.30 వేలు ఇవ్వాలి

వివిధ శాఖల్లో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనం రూ.30 వేలు ఇవ్వాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి టి.కోదండయ్య, జిల్లా గౌరవాధ్యక్షులు యస్.నాగరాజులు డిమాండ్ చేశారు. ఆ సంఘ నాయకులు కార్మికులతో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం డీఆర్వోకు వినతిపత్రం అందజేశారు. ఈ ధర్నాలో మధ్యాహ్నం భోజనం పథకం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రటరీ కవిత, ఏఐటీయూసీ సీనియర్ నాయకులు మణి, మహిళా సమైక్య నగర కార్యదర్శి బి.కుమారి, హెచ్.బాలాజీ రావు, మున్సిపల్ కార్పొరేషన్ ఔట్ సోర్సింగ్ యూనియన్ నాయకులు జయశంకర్, సురేష్, బుల్లెమ్మ, కస్తూరి, అమ్ములు తదితరులు పాల్గొన్నారు.

కాలువ ఆక్రమించారు



చెరువు కాలువ భూమిని ఆక్రమించారని ఐరాల మండలానికి చెందిన బాబు ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ కొందరు స్వార్థపరులు చెరువు కాలువను ఆక్రమించి తన పొలానికి వెళ్లేందుకు దారి లేకుండా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తన సమస్య పరిష్కరించాలని గతంలో పీజీఆర్ఎస్ లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.కలెక్టర్ తనకు న్యాయం చేయాలని అర్జీదారుడు కోరారు.

ఉపాధి కూలీలపై తేనెటీగల దాడి

- 19 మందికి గాయాలు
- ఇద్దరి పరిస్థితి విషమం


తేనెటీగల దాడిలో గాయపడిన వ్యక్తి

శ్రీరంగరాజపురం: ఉపాధి కూలీలపై తేనెటీగలు దాడి చేసిన సంఘటన మండలంలోని ఏఎం పురం పంచాయతీ దిగువ రిపుంజరాజపురం గ్రామంలో చోటుచేసుకుంది. ఉపాధి కూలీల కథనం మేరకు.. ఉపాధిహామీ పనుల్లో భాగంగా దిగువ రిపుంజరాజపురంలోని ఉపాధి హామీ కూలీలు సుమారు 30 మంది సోమవారం ఉదయం కొండకాలువ పనులకు వెళ్లారు. గ్రామానికి సమీపంలోని కాలువ పనులు చేస్తున్న కూలీలపై ఉన్నట్టుండి తేనెటీగలు దాడి చేశాయి. ఈ దాడిలో పలువురు కూలీలు గాయపడ్డారు. క్షతగాత్రులను స్థానికులు శ్రీరంగరాజపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అక్కడ వైద్యులు అందుబాటులో లేకపోవడంతో ఆరోగ్య సిబ్బంది ప్రథమ చికిత్స చేశారు. అనంతరం వారిని 108 వాహనంలో చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. గాయపడిన వారిలో ఆంజనేయులు, జారచంద్రుడు పరిస్థితి విషమంగా ఉంది. ఫీల్డ్‌అసిస్టెంట్ కొంత మంది ఉపాధి కూలీలకు బీమా చేయలేదని ఆరోపించారు. గాయపడిన వారిని ఎంపీడీఓ మోహన్‌మురళి, ఏపీఓ లలిత కుమారి పరామర్శించారు.

ఇరువర్గాలపై కేసు నమోదు

కార్వేటినగరం: పొలం వద్ద ఇరువర్గాలు ఘర్షణ పడిన సంఘటనకు సంబంధించి ఇరువర్గాలపై సోమవారం కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ హనుమంతప్ప తెలిపారు. సీఐ కథనం మేరకు... పాదిరికుప్పం గ్రామానికి చెందిన బాలాజీ కుటుంబానికి అదే గ్రామానికి చెందిన సహదేవ కుటుంబాని కొన్ని సంవత్సరాలుగా పొలాల విషయమై గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో గ్రామంలో సహదేవ ఇంటిపై మెర్క్యురీ లైటు ఏర్పాటు చేశారు. ఆ లైటు వెలుతురు తమ ఇంటిపై పడుతుందని ఇరు కుటుంబాలు గొడవపడి, ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకున్నారు. ఈ మేరకు ఇరువర్గాలపై కేసులు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

జిల్లా సమగ్రాభివృద్ధికి చర్యలు

- అధికారులతో కృష్ణబాబు


మాట్లాడుతున్న స్పెషల్ చీఫ్ సెక్రటరీ, జోనల్ ఇన్‌చార్జ్ ఆఫీసర్ కృష్ణబాబు

చిత్తూరు కలెక్టరేట్ : వివిధ శాఖల జిల్లా అధికారులు సమన్వయంతో పనిచేసి జిల్లా సమగ్ర అభివృద్ధికి చర్యలు చేపట్టాలని రాష్ట్ర ఆరోగ్య, వైద్య కుటుంబ సంక్షేమ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ, జోనల్ ఇన్‌చార్జ్ ఆఫీసర్ కృష్ణబాబు ఆదేశించారు. సోమవారం రాత్రి కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కుప్పం అభివృద్ధికి సమగ్ర ప్రణాళికలు రూపొందించి అమలు చేయాలన్నారు. జిల్లాకు తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలు సరిహద్దుగా ఉండడంతో పరిశ్రమల స్థాపన విరివిగా నెలకొల్పాలన్నారు. ఉపాధి అవకాశాల పెంపుపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. వ్యవసాయం ఆధారిత పంటలకు ప్రత్యామ్నాయంగా ఉద్యానవన పంటల సాగును ప్రోత్సహించాలని తెలిపారు. కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారం నిమిత్తం జిల్లా కేంద్రంతో పాటు కుప్పం, పలమనేరు నియోజకవర్గాల్లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నామన్నారు. శిశు ఆధార్ నమోదుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. పశుసంవర్థక శాఖ పరిధిలో పాడి పరిశ్రమను ప్రోత్సహించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. స్కిల్ ఆఫ్ చిత్తూరు కార్యక్రమం అమలులో రైతులకు సాంకేతిక పరిజ్ఞానంలో అవగాహన పెంచుతున్నామన్నారు. ఈ సమీక్షలో ఎస్పీ మణికంఠ చందోలు, జాయింట్ కలెక్టర్ విద్యాధరి, డీఎఫ్ఓ భరణి, ట్రైనీ కలెక్టర్ నరేంద్ర పాడల్, పలు శాఖల అధికారులు రవికుమార్ నాయుడు, సత్యనారాయణ, చంద్రశేఖర్‌రెడ్డి, వెంకటరమణ, వెంకటేశ్వరి, ఇస్మాయిల్, వరలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సదుపాయాలే లక్ష్యం

కుప్పం: గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మెరుగైన వైద్య సదుపాయలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ప్రత్యేక ముఖ్యకార్యదర్శి కృష్ణబాబు అన్నారు. సోమవారం కుప్పం వంద పడకల అస్పత్రిని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుప్పం నియోజకవర్గాన్ని ఆరోగ్య రంగంలో ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు టాటా సంస్థతో ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలిపారు. టాటా సంస్థ డిటిజల్ నెర్వ్ సెంటర్‌ను త్వరలో ప్రారంభిస్తున్నట్లు ఆయన తెలిపారు. జిల్లాలో అన్ని పీహెచ్‌సీలు, ఏరియా ఆస్పత్రుల్లో మందుల కొరత లేకుండా చూడాలని సూచించారు. అత్యవసరమైన సమయాల్లో మందులు కొనుగోలు చేసేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. అనంతరం ఆయన ఆస్పత్రికి వచ్చిన రోగులను నాణ్యమైన భోజనం అందుతుందా లేదా? మందులు అందుబాటులో ఉన్నాయా లేవా? అని అడిగి తెలుసుకున్నారు. ఏరియా ఆస్పత్రికి రోజుకు 300 నుంచి 350 మంది వరకు రోగులు రావడంపై ఆరా తీశారు. ఆస్పత్రిలోని రోగులకు రక్తపరీక్షలు, అన్ని రకాల ఆధునికంగా వైద్య సదుపాయాలు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. విలేజ్ హెల్త్ క్లినిక్‌లకు వచ్చే రోగులకు సంబంధించి అధికారులు సక్రమంగా విధులు నిర్వర్తించాలని వైద్యులకు సూచించారు. విలేజ్ క్లినిక్‌లో విధులు నిర్వహించే ఆరోగ్య సిబ్బంది బాధ్యతగా అంకితభావంతో పనిచేయాలని సూచించారు.

సంపూర్ణ ఆరోగ్యమే మహాభాగ్యం

గుడుపల్లె: సంపూర్ణ ఆరోగ్యమే మహాభాగ్యమని రాష్ట్ర వైద్య, సంక్షేమశాఖ స్పెషల్ ఛీఫ్ సెక్రటరీ ఎంటీ కృష్ణబాబు పేర్కొన్నారు. సోమవారం మండలంలోని కనమనపల్లెలోని హెల్త్ క్లినిక్‌ను అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశంతోనే ఆరోగ్య కేంద్రాలు ఏర్పాటు చేశారన్నారు. ఆయా గ్రామాల్లోని వైద్యాధికారులు ప్రతి ఇంటికీ వెళ్లి బీపీ,షుగర్, రక్త హీనత , దీర్ఘకాలిక వ్యాధులపై ఇంటింటా సర్వేలు నిర్వహిస్తున్నారా? లేదా అని అడిగి తెలుసుకున్నారు. ప్రతి నెలా ఏఎన్ఎంలు, నర్సులు ఇళ్ల వద్దకు వచ్చి పరీక్షలు చేస్తున్నారని అని ఆరా తీశారు. ఈ కార్యక్రమాల్లో కుప్పం ఏరియా ఆస్పత్రి కమిషనర్ వీరపాండియన్, జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, కడా పీడీ వికాస్ మర్మత్, డీఎంహెచ్ఓ సుధారాణి, ఎంపీడీఓ రాధాకృష్ణ, తహసీల్దార్ సీతారాం, ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్ మునిరత్నం, డాక్టర్ సురేష్, టీఎం బాబు పాల్గొన్నారు

నీటి సమస్య పరిష్కరించండి



రికార్డులు పరిశీలిస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

పలమనేరు: వేసవి కారణంగా జిల్లాలోని పలు గ్రామాల్లో నీటి సమస్య అధికంగా ఉందని, సమస్య పరిష్కారానికి సంబంధిత ఎంపీడీఓలు వెంటనే చర్యలు తీసుకోవాలని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు సూచించారు. పలమనేరులోని ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం ఆయన నీటి సమస్యపై అధికారులతో సమీక్షించారు. వెంటనే అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లాలో ఎంపీడీఓలుగా బాధ్యతలు చేపట్టనున్న వారికి పోస్టింగ్ ఉత్తర్వులపై సంతకాలను చేశారు.

హంద్రీ–నీవా కాలువ లైనింగ్ పనుల పరిశీలన

పలమనేరు నియోజకర్గంలోని వీకోట, బైరెడ్డిపల్లె మండలాల్లో సాగుతున్న హంద్రీ-నీవా కుప్పం ఉప కాలువ సిమెంట్ లైనింగ్ పనులను జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు సోమవారం పరిశీలించారు. కాంట్రాక్టర్ ఈ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తున్నారా, లేదా? అని చూశారు. కాలువ పనులను పూర్తి చేసి సీఎం చంద్రబాబు ఈ కాలువలోకి నీటిని వదలి ఈ ప్రాంత వాసులకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలన్నారు. కేవలం కాంట్రాక్టర్ల జేబులు నింపేందుకు పనులు చేసి ఆపై నీరు వదలకుంటే ఇక్కడి ప్రజల ఆగ్రహాన్ని చవి చూడాల్సి వస్తుందన్నారు.

నందీశ్వరుడిపై శివపార్వతుల విహారం


నందీశ్వరుడిపై విహరిస్తున్న శివపార్వతులు

పుత్తూరు: కామాక్షీ సమేత శ్రీసదాశివేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం శివపార్వతులు నందీశ్వరుడిపై విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. ఉదయం ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు చేశారు. అనంతరం భిక్షాటన ఉత్సవం నిర్వహించారు. రాత్రి 8 గంటలకు స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులకు విశేషాలంకరణ చేసి నందీశ్వరుడిపై కొలువుదీర్చి, పురవీధుల్లో ఊరేగించారు. నందివాహన సేవకు కోలా విఠల్, కోలా పెద్ద మునెమ్మ కుటుంబ సభ్యులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

సూళ్లూరుపేట మున్సిపల్ కమిషనర్‌పై ఫిర్యాదు

చిత్తూరు అర్బన్: సూళ్లూరుపేట మున్సిపల్ కమిషనర్ కే.చిన్నయ్యపై చిత్తూరులో పోలీసులకు ఫిర్యాదు చేశారు. సోమవారం చిత్తూరు మున్సిపల్ కమిషనర్ నరసింహ ప్రసాద్ స్థానిక వన్ టౌన్ పోలీసులకు రాతపూర్వకంగా ఫిర్యాదు అందజేశారు. చిన్నయ్య తన తండ్రికి ఉద్యోగం ఉండగా, ఆ విషయాన్ని దాచిపెట్టి చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్‌లో కారుణ్య నియామకం కింద ఉద్యోగం పొందాడని, తప్పుడు సర్టిఫికెట్లను అందజేసి, పదోన్నతులు పొందాడని ఫిర్యాదులో తెలిపారు. రాష్ట్ర మున్సిపల్ పరిపాలన శాఖ (డీఎంఏ) ఆదేశాలతో కేసు నమోదుకు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ప్రస్తుతం సూళ్లూరుపేట మున్సిపల్ కమిషనర్‌గా పని చేస్తున్న చిన్నయ్యపై తదుపరి చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేయగా దీనిపై పోలీసులు విచారణ ప్రారంభించారు.